సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 16 । జులై । 2024



..బిల్లుల చెల్లింపులో మార్పు

ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లుల చెల్లింపుల్లో మార్పులు చేస్తూ టీజీఎన్పీడీసీఎల్ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. 8లో



డిజైన్ మార్పుతో అన్యాయం

సీతారామ ప్రాజెక్ట్ డిజైన్ మార్పుతో జిల్లా రైతులకు అన్యాయం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
30° / 25°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి వాతావరణం చల్లగా ఉంటుంది. రాత్రికి కొన్నిచోట్ల వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, స్వామివారిని విశాఖపట్టణం వారాహి శ్రీ విద్యాపీఠం పీఠాధిపతి వామనశర్మ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

కొత్తగూడెం కేంద్రంగా ఆర్టీసీ డిస్పెన్సరీ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం రీజియన్‌లో కొత్తగూడెం కేంద్రంగా ఆర్టీసీ డిస్పెన్సరీ ఏర్పాటు చేయనున్నట్లు రీజినల్ మేనేజర్ ఏ.సరిరాం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం రీజియన్‌లోని ఏడు డిపోల పరిధిలో ఖమ్మం కేంద్రంగా ఒకటే ఆస్పత్రి ఉండడంతో ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని సంస్థ ఎండీ దృష్టికి తీసుకెళ్లగా కొత్తగూడెంలో అదనపు ఆస్పత్రి ఏర్పాటుకు అనుమతి ఇచ్చారని తెలిపారు. కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు డిపోలకు సంబంధించిన ఉద్యోగులు ఇక నుండి కొత్తగూడెంలో వైద్య సేవలు పొందొచ్చని, ఖమ్మంలో ఖమ్మం, సత్తుపల్లి, మధిర డిపోల ఆర్టీసీ ఉద్యోగులకు యథావిధిగా వైద్య సదుపాయాలు అందుతాయని ఆర్ఎం వెల్లడించారు.

కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు

భద్రాచలంటౌన్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గిరిజన గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న జూనియర్ అసిస్టెంట్లు, నాలుగో తరగతి సిబ్బంది బదిలీలు ప్రభుత్వ నిబంధనల ప్రకారమే చేపట్టామని ఆర్‌సీఓ వెంకటేశ్వరరాజు తెలిపారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం గురుకుల పాఠశాలలు, కళాశాలల జూనియర్ అసిస్టెంట్లు, ల్యాబ్ అసిస్టెంట్లు, మల్టీ పర్పస్ వర్కర్లు, కిచెన్ సహాయకుల బదిలీలు కౌన్సెలింగ్ ద్వారా చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. ఈమేరకు 40 శాతం నిబంధన ఆధారంగా 26 మందిని బదిలీ చేశామని, ఇందులో ఐదుగురు జూనియర్ అసిస్టెంట్లు, ఏడుగురు ల్యాబ్ అసిస్టెంట్లు, ఐదుగురు కార్యాలయ సహాయకులు, ఏడుగురు మల్టీపర్పస్ వర్కర్లు, ఇద్దరు కిచెన్ సహాయకులు ఉన్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఓ నరేందర్, కృష్ణార్జున, దేవదాస్, సిబ్బంది చంటి, గణేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలం యాత్రకు అదనపు బస్సులు

ఖమ్మంమయూరిసెంటర్: గురుపౌర్ణిమను పురస్కరించుకుని అరుణాచలం యాత్రకు వెళ్లే భక్తుల కోసం ఖమ్మం ఆర్టీసీ రీజియన్ నుండి రెండు సర్వీసులు ఏర్పాటుచేయగా మంచి ఆదరణ లభిస్తోందని ఆర్ఎం ఏ.సరిరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సులు ఖమ్మం, భద్రాచలం నుంచి 19వ తేదీన ప్రారంభం కానుండగా పరిమితికి మించి భక్తులు ముందుకొస్తే అదనపు సర్వీసులు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఈమేరకు భక్తులు బస్టాండ్లలోని రిజర్వేషన్ కౌంటర్లు, సంస్థ వెబ్‌సైట్ లేదా ఏటీబీ సెంటర్ల ద్వారా టికెట్లు బుక్ చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాల కోసం 99592 25985, 99592 25960 నంబర్లలో సంప్రదించాలని ఆర్ఎం సూచించారు.

సీఎంను కలిసిన గిడ్డంగుల సంస్థ చైర్మన్



సీఎంకు జ్ఞాపిక అందజేస్తున్న రాయల

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రాయల నాగేశ్వరరావు సోమవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంను సత్కరించి తన నియామకంపై కృతజ్ఞతలు తెలిపారు.

బొగ్గుట్టలో లిక్కర్ వార్ !

జిల్లా వ్యాప్తంగా 88 వైన్స్, 13 బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. వీటిలో బార్ అండ్ రెస్టారెంట్ ఉన్న వారు ఒకే లైసెన్స్‌ను రెన్యువల్ చేసుకుంటూ ఈ వ్యాపారంలో కొనసాగుతుండగా వైన్స్ విషయంలో మాత్రం ప్రతీ రెండేళ్లకోసారి అదృష్టాన్ని పరీక్షించుకోవాల్సి వస్తోంది. గతేదాది చివర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ముందు వైన్‌షాపులకు దరఖాస్తులు ఆహ్వానించారు. వేలాది మంది పోటీ పడగా కొందరికే లాటరీలో లిక్కర్ షాపులు లభించాయి. లిక్కర్ షాపు దరఖాస్తు ఫారం కొన్నది మొదలు.. అమ్మకాలు ప్రారంభించే వరకు వ్యాపారులు అనేక వ్యయప్రయాసలకోర్చారు. ఇప్పుడిప్పుడే వ్యాపారం కుదుట పడుతుందనే దశలో కొత్త కష్టాలు వచ్చి పడ్డాయి. దానికి ఇల్లెందు కేంద్ర బిందువుగా మారింది.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం



ఇల్లెందు మద్యం వ్యాపారంలో పలువురు ప్రముఖులు

- రాజకీయ విభేదాలతో ఏర్పడని సిండికేట్
- ఎమ్మార్పీకే మద్యం అమ్మకాలు
- జోరందుకున్న వ్యాపారంపై చుట్టుపక్కల సిండికేట్ కన్నెర్ర

ఎమ్మార్పీకే మద్యం

ఇల్లెందు పట్టణంలో ఎనిమిది లైసెన్స్‌డ్ లిక్కర్ ఔట్‌లెట్లు ఉన్నాయి. అయితే ఇక్కడ లిక్కర్ వ్యాపారంలో చక్రం తిప్పే కొందరు వ్యక్తుల కుటుంబ సభ్యులు స్థానిక రాజకీయాల్లోనూ కీలకంగా ఉన్నారు. గత రెండేళ్లుగా ఇల్లెందు మున్సిపాలిటీ పాలకవర్గంలో అంతర్గత విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. కౌన్సిలర్లు రెండు వర్గాలుగా చీలిపోగా.. అధికార పక్షం అండ కలిగిన వారు ప్రత్యర్థి వర్గానికి చెందిన వారి వ్యాపారాలు, ఆస్తులను టార్గెట్ చేస్తున్నారు. దీంతో ఇల్లెందులో లిక్కర్ వ్యాపారంలో సిండికేట్‌గా ఏర్పడలేదు. ఫలితంగా ఇక్కడ ఎమ్మార్పీకే మద్యం లభించడంతో పాటు పాపులర్ బ్రాండ్లు అందుబాటులో ఉన్నాయి.

కౌన్సెలింగ్ షురూ..

ఇప్పుడిప్పుడే లాభాలు అందుకుంటున్న ఇల్లెందు లిక్కర్ వ్యాపారులకు గత నెల రోజులుగా ఎక్సైజ్ శాఖలోని కొందరు అధికారులు, సిబ్బంది నుంచి కౌన్సెలింగ్ మొదలైంది. 'ఎన్నాళ్లుగానో కొనసాగుతున్న సిండికేట్ సంస్కృతికి తూట్లు పొడిస్తే ఎలా' అంటూ కుశల ప్రశ్నలతో మొదలైన ఈ చర్చ, ఆల్కహాల్ బిజినెస్‌లో సిండికేట్‌కు తిరిగి ప్రాణం పోయాలనే వరకు వెళ్లినట్టు తెలుస్తోంది. అయితే ఇక్కడ నెలకొన్న ప్రతీకార రాజకీయాల కారణంగా సిండికేట్ నిలబడటం కష్టమనే సందేహాలు లిక్కర్ వ్యాపారుల నుంచి ఎదురయ్యాయి. కలిసికట్టుగా సిండికేట్ ఏర్పాటు సాధ్యపడని పక్షంలో లైసెన్స్ దక్కించుకున్న వారంతా మూకుమ్మడిగా తమ వ్యాపారాన్ని ఒక్కరి చేతిలో పెట్టాలనే ప్రతిపాదన తెరమీదకు తెచ్చినట్టు తెలుస్తోంది.

అప్రమత్తమైన సిండికేట్

ఇల్లెందు చుట్టుపక్కల ప్రాంతాల్లో మద్యం వ్యాపారం ఎక్కువ శాతం సిండికేట్ చేతుల్లోకి వెళ్లిపోయింది. ఫలితంగా ఎమ్మార్పీకే అమ్మకాలు అనే నిబంధన నీటి మీద రాతగా మారిపోయింది. దీంతో ఇల్లెందు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన మద్యం ప్రియులు, బెల్ట్‌షాపుల నిర్వాహకులు బొగ్గుట్టలో మద్యం కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు. దీంతో ఇక్కడ లిక్కర్ వ్యాపారంలో ఉన్న వారికి లాభాలు పెరిగాయి. మరోవైపు సిండికేట్ అమల్లో ఉన్న ప్రాంతాల్లో మద్యం అమ్మకాలు తగ్గిపోయాయి. వెంటనే ఆ ప్రాంత సిండికేట్ శక్తులు అప్రమత్తం కావడంతో ఎక్సైజ్ శాఖలో కొందరు సిబ్బంది రంగంలోకి దిగారు.

మాకు సంబంధం లేదు

ఇల్లెందు మద్యం వ్యాపారుల మధ్య నెలకొన్న వివాదంతో మాకు సంబంధం లేదు. గత డిసెంబర్‌లో కొత్త లైసెన్సులు జారీ అయ్యాయి. మా ప్రమేయం ఉంటే ఆ సమయంలోనే ఏదైనా జరిగేది. వాళ్లు వాళ్లు గొడవలు పెట్టుకుని ఆ నెపాన్ని అబ్కారీ శాఖ మీదకు నెడుతున్నారు.

– జానయ్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్

మహిళా సాధికారతే లక్ష్యం

కలెక్టర్ జితేష్ వి పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, పక్కన డీఆర్‌డీఓ విద్యాచందన

చుంచుపల్లి: మహిళల సాధికారతే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళా శక్తి పథకాన్ని ముందుకు తీసుకొచ్చిందని, జిల్లాలోని మహిళలందరికీ ఈ పథకాన్ని వర్తింపజేయడమే లక్ష్యంగా అధికారులు ముందుకు సాగాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. ఐడీఓసీలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మహిళా శక్తి పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలకు జీవనోపాధి కల్పించడంతో పాటు వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించిందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల ద్వారా పలు రకాల పరిశ్రమల ఏర్పాటుతో మహిళల అభ్యున్నతి సాధ్యమని చెప్పారు. మహిళా సంఘాలు ఏర్పాటు చేసే పరిశ్రమలపై అవగాహనతో పాటు ధైర్యం ఉంటేనే విజయం సాధిస్తారని అన్నారు. పెరటి కోళ్లు, తేనెటీగలు, చేపల పెంపకం, పాడి పరిశ్రమ, కుట్టు మిషన్, మీ సేవ కేంద్రాలు, ఆహార పదార్థాల తయారీ తదితర చిన్న పరిశ్రమల స్థాపనతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని వివరించారు. రానున్న సంవత్సర కాలంలో వ్యవసాయం, చేపల పెంపకం, పాడి పరిశ్రమ, కోల్డ్ స్టోరేజ్ రంగాల్లో ప్రయోగాత్మకమైన పద్ధతుల ద్వారా జిల్లా సమగ్రాభివృద్ధి సాధించడమే లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్డీఓ విద్యాచందన, జెడ్పీ సీఈఓ చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబూరావు, ఉద్యానవన శాఖ అధికారి సూర్యనారాయణ, పశుసంవర్ధక శాఖ అధికారి పురంధరేశ్వర్ పాల్గొన్నారు.

ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

ప్రజావాణిలో అదనపు కలెక్టర్ విద్యాచందన



దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్


సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజావాణిలో వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన దరఖాస్తుల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ గన్యాతో కలిసి ఆమె దరఖాస్తులు స్వీకరించి, పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు.

దరఖాస్తుల్లో కొన్ని..

- అశ్వారావుపేట మండలం గుమ్మడివల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 136 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులే ఉన్నారని, పాఠశాల తెరచి నెల దాటినా సక్రమంగా క్లాసులు నడవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగా డీఈఓకు ఎండార్స్ చేశారు.
- తన భర్త మరణానంతరం కుమారుడు ఆస్తిలాక్కుని తన బాగోగులు చూడకుండా యాచక వృత్తివైపు పంపాడని, తన భర్త నుంచి వచ్చిన రూ.5 లక్షలు, ఇంటి స్థలం కూడా తీసుకుని తనను వేధిస్తున్నాడని కొత్తగూడెం సఫాయిబస్తీకి చెందిన ఖాసీంబీ ఫిర్యాదు చేయగా ఆర్డీఓకు ఎండార్స్ చేశారు.

తాలిపేరుకు కొనసాగుతున్న వరద

నాలుగు గేట్ల ద్వారా 2,356 క్యూసెక్కుల నీరు విడుదల



ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద ఉధృతి

చర్ల: మండలంలోని తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతోంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మూడు రోజుల నుంచి నీరు వచ్చి చేరుతోంది. దీంతో మూడు రోజులుగా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈక్రమంలో సోమవారం కూడా ప్రాజెక్టుకు చెందిన 25 క్రస్ట్ గేట్లలో నాలుగు గేట్లను ఎత్తి 2,356 క్యూసెక్కుల చొప్పున నీటిని దిగువకు విడుదల చేశారు. కాగా, ప్రాజెక్టులోకి 3435 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 74 మీటర్లు కాగా ఎగువ నుంచి వస్తున్న వరద దృష్ట్యా నీటిమట్టాన్ని 72.20 మీటర్లుగా క్రమబద్ధీకరిస్తున్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టండి



సమస్యలు తెలుసుకుంటున్న ఏపీఓ డేవిడ్‌రాజ్

భద్రాచలంటౌన్: వాతావరణంలో వస్తున్న మార్పులతో ఆశ్రమ, గురుకుల పాఠశాలల విద్యార్థులకు సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని, విద్యాసంస్థల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని ఐటీడీఏ ఏపీఓ డేవిడ్‌రాజ్ ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం ఐటీడీఏలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గిరిజనులు ఇచ్చిన వినతులపై తన పరిధిలోని సమస్యలు పరిష్కరిస్తానని, మిగిలినవి సంబంధిత అధికారులకు పంపించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా, భూ పట్టాల ఆన్‌లైన్, వ్యవసాయ మోటార్లు, స్వయం ఉపాధి సమస్యలపై పలువురు వినతులు సమర్పించారు. డీడీ మణెమ్మ, రవీంద్రనాథ్, తానాజీ, శ్రీనివాస్, రమణ య్య, అశోక్, నరేష్, మునీర్ పాషా, నారాయణరావు, భాస్కర్, సావిత్రి, ఆదినారాయణ, దుర్గయ్య పాల్గొన్నారు.

భారీగా కార్యదర్శుల బదిలీలు

ఓపెన్ కౌన్సెలింగ్ పద్ధతిలో స్థానచలనం



కార్యదర్శుల బదిలీ ప్రక్రియను పరిశీలిస్తున్న డీపీఓ తదితరులు

చుంచుపల్లి: ఉద్యోగుల సాధారణ బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులకు స్థానచలనం కల్పిస్తున్నారు. ఈనెల 4న ప్రారంభమైన ఈ ప్రక్రియ 21వ తేదీ వరకు కొనసాగనుంది. బదిలీల్లో స్పౌజ్, పీహెచ్‌సీ, మెడికల్ గ్రౌండ్ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. కాగా, సోమవారం ఐడీఓసీలోని డీపీఓ చాంబర్‌లో మండల పంచాయతీ అధికారులు, కార్యదర్శుల బదిలీల ప్రక్రియ నిర్వహించారు. జిల్లాలో బదిలీకి అర్హత పొందిన ముగ్గురు ఎంపీఓలతో పాటు సుమారు 150 మంది వివిధ కేటగిరీల పంచాయతీ కార్యదర్శులకు స్థానచలనం కల్పించారు. జిల్లా పంచాయతీ అధికారి వి.చంద్రమౌళితో పాటు డీఎల్‌పీఓ కె.వి.రమణ బదిలీల తంతును పరిశీలించారు. ఓపెన్ కౌన్సెలింగ్ విధానం ద్వారా ఖాళీల ఆధారంగా ఎంపీఓలు, కార్యదర్శులు కోరుకున్న ప్రాంతాలకు బదిలీ చేశారు. సుజాతనగర్, అశ్వాపురం, దుమ్ముగూడెం ఎంపీఓలతో పాటు గ్రేడ్ –1 కార్యదర్శులు ముగ్గురు, గ్రేడ్ –2 ఏడుగురు, గ్రేడ్ –3 ఆరుగురు, గ్రేడ్ – 4 కార్యదర్శులు 133 మందిని బదిలీ చేశారు. మరో ఐదుగురు కార్యదర్శులకు స్పౌజ్ కేసుల కింద అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శుల బదిలీల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, నాలుగేళ్ల సర్వీస్ పూర్తితో పాటు పలు అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్నామని వివరించారు.

కొత్త డాక్టర్లొచ్చేనా..?

ఏజెన్సీ వాసులను భయపెడుతున్న బదిలీలు

- ఏరియా ఆస్పత్రి నుంచి వెళ్లేందుకు పలువురు వైద్యుల దరఖాస్తు
- ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చేందుకు మాత్రం అనాసక్తి
- రామాలయంలో అందుకు భిన్నంగా పరిస్థితులు



భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి

భద్రాచలం : ఎంతో కాలం తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన బదిలీల ప్రక్రియ భద్రాచలం ఏరియా వాసులకు దిగులు పుట్టిస్తోంది. కొన్ని శాఖల్లో బదిలీల పట్ల హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నా.. మరికొన్ని విభాగాల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రధానంగా వైద్యరంగంలో గిరిజనులకు పెద్ద దిక్కుగా ఉన్న భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి మళ్లీ దిగులు పట్టుకునేలా ఉంది. ఇక శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అర్చకులు మాత్రం బదిలీలను వ్యతిరేకిస్తున్నారు.

ఆస్పత్రికి బదిలీల షాక్..

అసలే సరిపడా వైద్యులు, సిబ్బంది లేక అష్టకష్టాలు పడుతున్న భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి బదిలీల రూపంలో భారీ షాక్ తగలనుంది. ఇటీవల జీఓ నంబర్ 317 అమల్లో భాగంగా నర్సింగ్ పోస్టులు సగం ఖాళీ కాగా, ప్రస్తుత బదిలీల్లో మరికొందరు వెళ్లనున్నారు. వైద్యులు కూడా 40 శాతం మంది బదిలీలకు అర్హులుగా పేర్కొనడంతో పలువురు దరఖాస్తు చేసుకున్నారు. 200 పడకలు గల భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో వైద్యులు, నర్సింగ్, పారామెడికల్, అడ్మినిస్ట్రేటివ్ విభాగాల్లో మొత్తం 207 పోస్టులు ఉండగా అందులో రెగ్యులర్, కాంట్రాక్ట్ ప్రాతిపదికన 117 మంది పనిచేస్తున్నారు. 90 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో డాక్టర్ పోస్టులు 69 ఉండగా.. 17 మంది రెగ్యులర్, కాంట్రాక్ట్ ప్రాతిపదికన 23 మంది పనిచేస్తున్నారు. 29 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నర్సింగ్ పోస్టులు 53కు 17 మంది రెగ్యులర్, ఆరుగురు కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తుండగా 30 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న వైద్యులు చాలా కాలంగా ఇక్కడ పని చేస్తుండడంతో బదిలీల్లో భాగంగా సొంత జిల్లాలకు వెళ్లాలని తహతహలాడుతున్నారు.

ఆసక్తి చూపని కొత్త వైద్యులు, సిబ్బంది..

భద్రాచలం పూర్తిగా ఏజెన్సీ ప్రాంతం కావడంతో మెట్రో, అర్బన్ ప్రాంతాల నుంచి ఇక్కడి ఏరియా ఆస్పత్రికి వచ్చేందుకు పలువురు డాక్టర్లు, సిబ్బంది ఆసక్తి చూపటం లేదు. ఖాళీ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేసేందుకు గతంలో పలుమార్లు కలెక్టర్ నోటిఫికేషన్ విడుదల చేసినా ఎవరూ ముందుకు రాకపోవడంతో పోస్టులు భర్తీ కాలేదు. ఈ తరుణంలో ప్రభుత్వం చేపట్టిన బదిలీలతో ఏరియా ఆస్పత్రిలో పోస్టులన్నీ ఖాళీ అయ్యే పరిస్థితి కనిపిస్తోంది. తిరిగి ఆ పోస్టుల్లో ఇతర ప్రాంతాల నుంచి వైద్యులు, సిబ్బంది రాకుంటే నాలుగు రాష్ట్రాల గిరిజనుల వైద్య సేవలకు ఇక్కట్లు తప్పేలా లేవు. ప్రస్తుతం పనిచేస్తున్న 17 మంది రెగ్యులర్ వైద్యుల్లో 9 మంది బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ఆస్పత్రి సూపరింటెండెంట్, ఆర్ఎంఓ, ఇతర కీలక ఇన్‌చార్జ్ పోస్టులు సైతం ఖాళీ కానున్నాయి. ఇక నర్సింగ్ సిబ్బంది 16 మంది, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్‌ల పేర్లతో బదిలీల చిట్టా విడుదలైంది. బదిలీపై వెళ్లేవారు, కొత్తగా వచ్చేవారి వివరాలు మరో రెండు, మూడు రోజుల్లో పూర్తిగా తెలిసే అవకాశం ఉంది. ఈ వ్యవహారంలో జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఏరియా ఆస్పత్రిలో వైద్యులు, నర్సింగ్ పోస్టులన్నీ భర్తీ అయ్యేలా చూడాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

రామాలయంలో విచిత్ర పరిస్థితి..

ప్రభుత్వం చేపట్టిన బదిలీలతో భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో మరో విచిత్ర స్థితి నెలకొంది. ప్రభుత్వ నిబంధనల మేరకు.. దేవాదాయ శాఖలో ఎక్కువ కాలం ఒకే చోట పనిచేస్తున్న అర్చకులు, అధికారులు, సిబ్బందిని బదిలీ చేయాల్సి ఉంది. అయితే రామాలయంలో పనిచేసే అర్చకులు ఆలయ నిర్మాత భక్త రామదాసు తరం నుంచి వంశపార్యపరంగా పనిచేస్తున్న వారు కావడం గమనార్హం. భక్త రామదాసు ఆలయ నిర్మించాక స్వామి వారికి నిత్యపూజలు చేసేందుకు తమిళనాడులోని శ్రీరంగం నుంచి పొడిచేటి, అమరవాది, కోటి, తూరుగోటి, గొట్టిపుల్ల అనే ఐదు ఇంటి పేర్లు గల అర్చకులను భద్రాచలం తీసుకొచ్చారు. నాటి నుంచి ఈ వంశీయులే అర్చకులుగా పనిచేస్తున్నారు. ఆగమ శాస్త్రం ప్రకారం స్వామివారి ఉత్సవాలు, పూజలు చేస్తున్నారు. ఇందులో కొన్ని క్రతువులు ఈ క్షేత్రంలోనే నిర్వహించడం మరో ప్రత్యేకత. అయితే ఇటీవల జారీ చేసిన ఉత్తర్వుల్లో రామాలయ అర్చకులను సైతం బదిలీ చేయాలని పేర్కొనడం వివాదంగా మారింది. ఈ నిర్ణయాన్ని అర్చకులంతా ముక్తకంఠంతో ఖండిస్తున్నారు. ఈ మేరకు ప్రజాప్రతినిధులు, దేవాదాయ శాఖ కమిషనర్‌కు సైతం వినతిపత్రాలు అందించారు. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. కాగా దీనిపై అర్చకులు హైకోర్టుకు వెళ్లినట్టు తెలిసింది

ఘనంగా బహుడా యాత్ర



దేవతామూర్తులకు పూజలు చేస్తున్న దృశ్యం

అశ్వాపురం: మండల కేంద్రంలోని భారజల కర్మాగారం అధికారులు, ఉద్యోగుల నివాస సముదాయమైన గౌతమీనగర్ కాలనీలో సోమవారం జగన్నాథ బహుడా యాత్రను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భారజల కర్మాగారం జీఎం జగ్గారావు యాత్రను ప్రారంభించారు. ఒడిశాకు చెందిన కర్మాగార అధికారులు, ఉద్యోగుల ఆధ్వర్యంలో ఏర్పాటైన ఉత్కల్ పతాగర్ కమిటీ ఆధ్వర్యంలో తొమ్మిది రోజులుగా కనులపండువగా నిర్వహిస్తున్న జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు గుండిచాఘర్ మందిరంలో జగన్నాథ, బలభద్రస్వాములతో పాటు సుభద్రాదేవికి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం హోమం చేశారు. అనంతరం జగన్నాథస్వామి, బలభద్రుడు, సుభద్రాదేవి రథంలో కొలువుదీరగా భక్తులు ఇరువైపులా బారులుదీరి రథాన్ని లాగారు. గుండిచాఘర్ మందిరం నుంచి ఉత్కల్ పతాగర్ మండపానికి రథాన్ని తీసుకొచ్చి దేవతా మూర్తులను యథాస్థానంలో ప్రతిష్ఠించి పూజలు చేశారు. కార్యక్రమంలో ఉత్కల్ పతాగర్ కమిటీ అధ్యక్షుడు అరుణ్‌మహాపాత్రో, సరోజ్‌దాస్, సుధాకర్ నాయక్, సందీపన్‌సాహు, మదన్‌మోహన్‌సాహు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలలో టీచర్ల కొరత

టీసీలు తీసుకున్న 21 మంది విద్యార్థులు



కుర్నపల్లి ప్రాథమికోన్నత పాఠశాల

చర్ల రూరల్: మండలంలోని కుర్నపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. ఇక్కడ ఏడుగురు ఉపాధ్యాయులు విధులు నిర్వర్తించాల్సిఉండగా, ప్రసుతం స్కూల్ అసిస్టెంటు, తెలుగు పండిట్, హిందీ పండిట్ ముగ్గురు మాత్రమే ఉన్నారు. మరో స్కూల్ అసిస్టెంట్, మూడు ఎస్‌జీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉపాధ్యాయుల కొరత ఉండటంతో తల్లిదండ్రులు టీసీలు తీసుకుని తమ పిల్లలను ఇతర పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. మొత్తం 106 మంది విద్యార్థులు ఉండగా, ఇప్పటికే 21 మంది టీసీలు తీసుకుని వెళ్లారు. ప్రస్తుతం 85 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ఈ విషయమై పాఠశాల హెచ్‌ఎం కె.కల్యాణ్ చక్రవర్తిని వివరణ కోరగా.. విద్యార్థులు హాస్టళ్లలో చేరేందుకు టీసీలు తీసుకుని వెళ్లారని, ఉపాధ్యాయుల కొరత వల్ల కాదని పేర్కొన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు



మాట్లాడుతున్న సీఐ రమేష్‌కుమార్

కొత్తగూడెంటౌన్: మత్తు పదార్థాలకు బానిస కావొద్దని, జీవితాలను నాశనం చేసుకోవద్దని కొత్తగూడెం టూటౌన్ సీఐ తొగటి రమేష్‌కుమార్ సూచించారు. సోమవారం రాత్రి రుద్రంపూర్, తిలక్‌నగర్‌లలో డ్రగ్స్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. కొందరు యువకులు, విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసై మతిస్థిమితం కోల్పోతున్నారని అన్నారు. మత్తు పదార్థాలు సేవించినా, విక్రయించినా కఠిన శిక్షలు ఉంటాయని తెలిపారు. బెల్ట్‌షాపులు, గుడుంబా విక్రయాల వల్లే ఈ ప్రాంతంలో గొడవలు జరుగుతున్నాయని స్థానిక మహిళలు వివరించగా.. తగిన చర్యలు తీసుకుంటామని సీఐ హామీ ఇచ్చారు.

బాలకార్మికుడి గుర్తింపు

పాల్వంచ: ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా సోమవారం అధికారులు బాలకార్మికుడిని గుర్తించారు. పట్టణంలోని శాస్త్రీ రోడ్‌లో పలు షాపుల్లో తనిఖీలు చేసిన అధికారులు న్యూ క్రాక్ చెప్పుల దుకాణంలో పనిచేస్తున్న 14 ఏళ్ల బాలుడిని గుర్తించి అతని తండ్రికి అప్పగించారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో షాపు నిర్వాహకుడు నిఖిలేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాఘవయ్య తెలిపారు. తనిఖీల్లో మణుగూరు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ బండి నాగరాజు, బూర్గంపాడు ఎస్‌ఐ ఏసోబు, డబ్ల్యూసీ నాగలక్ష్మి, డీసీపీయూ కౌన్సిలర్ కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

దేశానికి ప్రమాదకరంగా మతోన్మాదం



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

మధిర: మతోన్మాదం దేశానికి పెనుముప్పుగా మారుతోందని సీపీఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మిరియం వెంకటేశ్వర్లు తెలిపారు. మధిర మండలం దెందుకూరులో జరుగుతున్న సీపీఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగతులను రెండో రోజైన సోమవారం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ప్రారంభించగా, వెంకటేశ్వర్లు మాట్లాడారు. కష్టాలు, కన్నీళ్లతో నిండిన ప్రజలకు ఊరట కలిగించే సాధనంగా మతం కొనసాగుతుండగా.. పాలకులు మాత్రం ప్రజలను కులం, మతం పేరుతో విభజిస్తున్నారని ఆరోపించారు. దీనికి తోడు వ్యత్యాసాలు సృష్టించి మతోన్మాదానికి దారి తీస్తున్నారని తెలిపారు.

ఓ పార్టీ నేతపై అట్రాసిటీ కేసు నమోదు !

కొత్తగూడెంటౌన్ : ఒక ప్రముఖ రాజకీయ పార్టీ జిల్లా స్థాయి నేతపై కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో సోమవారం రాత్రి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సమాచారం. వారం రోజుల క్రితం ఆశ్వారావుపేటలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆ నాయకుడిపై ఒక వ్యక్తి.. తనను కులం పేరుతో దూషించాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు కొత్తగూడెం వన్‌టౌన్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిసింది. ఈ విషయమై డీఎస్పీ అబ్దుల్ రెహమాన్‌ను వివరణ కోరగా కేసు ఇంకా దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,705

విద్యుత్ బిల్లుల చెల్లింపులో మార్పు



భద్రాచలం విద్యుత్‌శాఖ కార్యాలయంలో బిల్లులు చెల్లిస్తున్న వినియోగదారులు(ఫైల్)

- థర్డ్ పార్టీ యాప్‌ల నుంచి చెల్లింపులు నిలిపివేత
- టీజీఎన్పీడీసీఎల్ యాప్, వెబ్‌సైట్ ద్వారానే సేవలు
- ఈ నెల నుంచే అమల్లోకి వచ్చిన కొత్త నిబంధన

భద్రాచలంఅర్బన్: ఇక నుంచి విద్యుత్ బిల్లులు టీజీఎన్పీడీసీఎల్ వెబ్‌సైట్/యాప్ ద్వారా మాత్రమే చెల్లించాలి. ఆర్బీఐ భారత్ బిల్ పేమెంట్ల మార్గదర్శకాల ప్రకారం యాప్‌ల ద్వారా చెల్లింపులను ఈ నెల 1 నుంచి నిలిపివేశారు. ఇప్పటివరకు థర్డ్ పార్టీ యాప్స్ ఫోన్ పే, గూగుల్‌పే, పేటీఎం, వంటి వాటి ద్వారా ఆన్‌లైన్‌లో బిల్లులు చెల్లిస్తున్నారు. కొందరు విద్యుత్ కార్యాలయాల్లోని రెవెన్యూ కౌంటర్ల వద్ద కూడా చెల్లిస్తున్నారు. మరికొందరు విద్యుత్ పంపిణీ సంస్థలకు చెందిన వెబ్‌సైట్, మొబైల్ యాప్స్ ద్వారా కడుతున్నారు. అత్యధిక వినియోగదారులు మాత్రం థర్ పార్టీ యూపీఐ యాప్‌లను వినియోగిస్తున్నారు. అయితే చెల్లింపుల్లో కొన్నిసార్లు సాంకేతిక సమస్యలు ఏర్పడుతున్నాయి. బిల్లులు చెల్లించాక, ఆ నగదు విద్యుత్ సంస్థకు అందడంలో జాప్యం జరుగుతుండగా, ఇలాంటి చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. కాగా వినియోగదారులు టీజీఎన్పీడీసీఎల్ మొబైల్ యాప్ లేదా (https://tgnpdcl.com) వెబ్‌సైట్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించేటప్పుడు ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం, ఇతర యూపీఐ యాప్స్, డెబిట్, క్రెడిట్, నెట్ బ్యాంకింగ్, వాలెట్స్, క్యాష్ కార్డులను కూడా వినియోగించుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. ఈ నెల 1వ తేదీ నుంచే ఆర్బీఐ కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. యాప్ ద్వారా చెల్లింపులు నిలిపివేసింది. విద్యుత్ శాఖ యాప్ లేక వెబ్‌సైట్‌లో చెల్లిస్తే నేరుగా డబ్బు సంస్థకు చేరేలా రూపకల్పన చేసినట్లు ఎన్పీడీసీఎల్ అధికారులు పేర్కొంటున్నారు.

63.70 శాతం ఆన్‌లైన్ చెల్లింపులే

జిల్లా వ్యాప్తంగా మొత్తం 4,41,450 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటి ద్వారా గత నెల రూ.31.4 కోట్ల బిల్లులు వసూలయ్యాయి. 63.70 శాతం అంటే 74,203 మంది వినియోగదారులు ఆన్‌లైన్ ద్వారా దాదాపు రూ.15.98 కోట్లు చెల్లించారు. మిగిలిన 36.73 శాతం మంది వినియోగదారులు తమ ఇంటికి వచ్చిన సిబ్బందికి, సేవా కేంద్రాల్లో బిల్లులు చెల్లించారు.

ప్రజలు సహకరించాలి



విద్యుత్ శాఖ యాప్ లేదా వెబ్‌సైట్‌లో మాత్రమే వినియోగదారులు బిల్లులు చెల్లించాలి. ఈ నెల ఒకటి నుంచి ఫోన్ పే, గూగూల్ పే, పేటీఎం, అమెజాన్ తదితర యాప్ ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపులను నిలిపివేశాం. ప్రజలు గమనించి సహకరించాలి.

–భీకంసింగ్, ఇన్‌చార్జ్ ఎస్‌ఈ, కొత్తగూడెం సర్కిల్

అవగాహన కల్పించాలి



ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం, అమెజాన్ తదితర యాప్‌ల ద్వారా సులువుగా విద్యుత్ బిల్లులు చెల్లించేవాళ్లం. ప్రస్తుతం నిలిపేయడంతో ఇబ్బంది పడాల్సిన పరిస్థితి. ఇకపై విద్యుత్ శాఖ యాప్ లేదా వెబ్‌సైట్ లోనే చెల్లించాలనే నిబంధనపై అవగాహన కల్పించాలి.

–నవీన్, న్యాయవాది, భద్రాచలం

సీతారామ లింక్ కెనాల్ పనులు అడ్డగింత



వినోభానగర్‌లో కెనాల్ పనులను అడ్డుకుంటున్న నాయకులు, రైతులు

జూలూరుపాడు: సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ ద్వారా గోదావరి జలాలను జూలూరుపాడు మండలానికి అందించాలని డిమాండ్ చేస్తూ లింక్ కెనాల్ పనులను సోమవారం అఖిలపక్షం ఆధ్వర్యాన నాయకులు, రైతులు అడ్డుకున్నారు. మండలంలోని వినోభానగర్ వద్ద జరుగుతున్న పనులను అడ్డుకుని నిరసన తెలిపిన నాయకులు మాట్లాడారు. జూలూరుపాడు మండలం నుంచి ప్రాజెక్టు కెనాల్ వెళ్తున్నా ఇక్కడి భూములకు నీరు ఇవ్వకపోవడం సరికాదన్నారు. ఇకనైనా సీతారామ ప్రాజెక్టు కెనాల్‌ను పాత డిజైన్ ప్రకారమే నిర్మించి తొలుత స్థానిక రైతులకు సాగునీరు ఇవ్వాలని, సబ్ కెనాళ్ల ద్వారా మండలంలోని చెరువులకు అనుసంధానం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, కాకతీయుల కాలంలో నిర్మించిన పోలారం చెరువు కట్ట గండి పూడ్చి రిజర్వాయర్‌గా నిర్మించాలన్నారు. అనంతరం తహసీల్దార్ స్వాతి బిందుకు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో మాస్‌లైన్‌తో పాటు వివిధ పార్టీలు, సంఘాల నాయకులు జాటోత్ కృష్ణ, చంద్ర నరేంద్రకుమార్, ఎస్.కే.ఉమర్ మియా, వై.గోపాల్‌రావు, బానోత్ ధర్మా, గుండెపిన్ని వెంకటేశ్వర్లు, యాసా నరేష్, వల్లోజి రమేష్, తంబర్ల నరసింహారావు, ఎస్.కే.చాంద్‌పాషా, బానోత్ మధు, వల్లమల చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు. అలాగే, సీతారామ ప్రాజెక్ట్ ద్వారా జూలూరుపాడు మండలానికి సాగునీరు అందించాలని న్యూడెమోక్రసీ ఆధ్వర్యాన ఎలుకలొడ్డు, రాంపురంతండా గ్రామాల్లో నిరసన తెలిపారు. నాయకులు ఉమర్‌మియా, వల్లోజి రమేష్, సురేష్, గలిగె వెంకటేశ్వర్లు, బచ్చల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సీతారామ డిజైన్ మార్పుతో రైతులకు అన్యాయం

- తొలుత స్థానిక అవసరాలకే నీరు కేటాయించాలి
- ఎమ్మెల్యేలకు గోదావరి జలాల సాధన కమిటీ వినతి



పినపాక ఎమ్మెల్యే వెంకటేశ్వర్లుకు వినతిపత్రం ఇస్తున్న గుమ్మడి నర్సయ్య, నాయకులు

బూర్గంపాడు/ఇల్లెందు/వైరా: ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని ప్రతీ ఎకరానికి సాగునీరు అందించాలనే సంకల్పంతో ప్రారంభించిన సీతారామ ప్రాజెక్ట్ డిజైన్లలో మార్పులు చేయడం ద్వారా ఏజెన్సీ ప్రాంతానికి అన్యాయం జరుగుతోందని.. ఇకనైనా స్పందించి తొలుత స్థానిక అవసరాలకు నీరు దక్కేలా చూడాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య కోరారు. గోదావరి జలాల సాధన కమిటీ ఆధ్వర్యాన నాయకులు సోమవారం పినపాక, ఇల్లెందు, భద్రాచలం, వైరా ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, తెల్లం వెంకట్రావు, రాందాస్‌నాయక్‌కు వినతిపత్రాలు అందజేశారు.ఈసందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ సీతారామ ప్రస్తుత డిజైన్‌తో మొదటి విడతలో ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లోని 26 మండలాల కు సాగునీరు అందిస్తామని పాలకులు చెబుతుండగా.. ఇందులో ఏజెన్సీ మండలాలకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. ఆయకట్టులో మూడింట రెండొంతులు పాత ఆయకట్టు స్థిరీకరణ జరుగుతున్నందున పరిశీలించాలని కోరారు. ఇదేరీతిలో ముందుకు సాగితే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతులకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. ఈమేరకు ఏజెన్సీ రైతుల కష్టాలను పరిగణనలోకి తీసుకుని గోదావరి జలాలను కృష్ణానది ఆయకట్టుకు తరలించడానికి ముందు ఇల్లెందు తదితర నియోజకవర్గాల రైతులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో గోదావరి జలాల సాధన కమిటీ నాయకులు సిలివేరు సత్యనారాయణ, రాంసింగ్, ఆలేటి కిరణ్, నూతలపాటి వెంకటేశ్వరరావు, బుర్రా వెంకన్న, బంధం నాగయ్య పాల్గొన్నారు.

వృద్ధురాలికి అండగా చైర్‌పర్సన్, సీఐ



వృద్ధురాలితో చైర్‌పర్సన్, టూటౌన్ పోలీసులు, మున్సిపల్ సిబ్బంది

కొత్తగూడెంఅర్బన్/సింగరేణి(కొత్తగూడెం): పట్టణంలోని ఓ వృద్ధురాలికి కొత్తగూడెం మున్సిపల్ చైపర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి అండగా నిలిచారు. వివరాలు ఇలా.. కొత్తగూడెం పట్టణంలోని రామవరం ఏడో వార్డులో సావిత్రమ్మ(90) వృద్ధురాలు నివసిస్తోంది. ఆమెకు ఒక సోదరుడు ఉండగా, కొంత కాలం క్రితం చనిపోయాడు. సావిత్రమ్మ కూటి కోసం వివిధ ప్రాంతాల్లో వంటలు, పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. వయసు మీద పడటంతో పనిచేయలేని స్థితికి చేరుకుంది. తిరిగి రామవరంలోని సోదరుడికి ఇంటికి రాగా, సోదరుడి భార్య ఇంటికి తాళం వేసి వెళ్లి, హైదరాబాద్‌లోనే ఉంటున్నట్లు తెలిసింది. దీంతో దిక్కుతోచక వారం రోజులుగా ఎండలో, వానలో ఇంటి బయటే ఉంటూ అవస్థ పడుతోంది. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, టూ టౌన్ సీఐ రమేష్ కుమార్ వృద్ధురాలి వద్దకు చేరుకున్నారు. తాళం పగులగొట్టించి, ఇల్లు శుభ్రం చేయించి ఆమె ఉండడానికి తగిన ఏర్పాట్లు చేశారు. మానవత దృక్పథంతో వృద్ధురాలికి అండగా నిలిచిన చైర్‌పర్సన్, సీఐలను స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్ చౌహాన్, జవాన్ రామారావు, టూ టౌన్ ఏఎస్‌ఐ ఇస్తరి, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర రావు, కానిస్టేబుళ్లు రాజా, వజ్జా వెంకటేశ్వర్లు ఆర్పీ సునీత, పారిశుద్ధ సిబ్బంది పాల్గొన్నారు.

భార్యాబిడ్డల హత్య కేసులో నిందితుడి రిమాండ్

రఘునాథపాలెం: భార్య, ఇద్దరు కుమార్తెలను హత్య చేసిన బోడా ప్రవీణ్‌ను సోమవారం కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు రఘునాథపాలెం సీఐ శ్రీహరి తెలిపారు. గత మార్చి 28న రఘునాథపాలెం మండలం బావోజీ తండాకు చెందిన డాక్టర్ ప్రవీణ్ కారులో భార్య కుమారి, పిల్లలను తీసుకెళ్లి హత్య చేసిన విషయం విదితమే. భార్యకు అధిక మోతాదులో మత్తు ఇవ్వడంతో పాటు పిల్లల నోరు, ముక్కు మూసి హత్య చేశాడు. ఆపై రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే యత్నం చేసినా పోలీసు దర్యాప్తులో నిజం బయటపడడంతో ప్రవీణ్‌ను ఆదివారం అరెస్ట్ చేశారు. ఈమేరకు ఆయనను సోమవారం రిమాండ్‌కు తరలించగా, ప్రవీణ్‌తో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ హత్యకు ప్రేరేపించిన కేరళకు చెందిన నర్స్ సోనీ ఫ్రాన్సిస్‌ను త్వరలోనే అరెస్ట్ చేస్తామని సీఐ తెలిపారు.

గుట్కా ప్యాకెట్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గుట్కా ప్యాకెట్లతో పోలీసులు

జూలూరుపాడు: మండల కేంద్రంలోని దుకాణాల్లో సోమవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. రెండు దుకాణాల నుంచి రూ.12,500 విలువైన నిషేధిత గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. దుకాణ యజమానులు మిట్టపల్లి మణికంఠ, బానోత్ ప్రసాద్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాణా ప్రతాప్ తెలిపారు.

కిన్నెరసాని గ్రామంలో...

పాల్వంచరూరల్: మండల పరిధి కిన్నెరసాని గ్రామంలోని వారనాసి సాయితేజ కిరాణం దుకాణంలో నిషేధిత గుట్కా ప్యాకెట్లను విక్రయిస్తుండగా సోమవారం పోలీసులు పట్టుకున్నారు. కిరాణం యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

హెచ్చు పాటదారుడికే పండితాపురం సంత

గ్రామసభ తీర్మానంతో నిర్ణయించిన అధికారులు



గుత్తేదారుడు వీరన్నను అభినందిస్తున్న అధికారులు

కామేపల్లి: పశువుల క్రయవిక్రయాలకు రాష్ట్రంలోనే పేరున్న కామేపల్లి మండలం కొమ్మినేపల్లి(పండితాపురం) గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీ కృష్ణప్రసాద్ పశువుల వారంతపు సంత కౌలు బాధ్యతల అప్పగింత పూర్తయింది. పలుమార్లు వేలం నిర్వహించినా ప్రభుత్వ మద్దతు ధర రాకపోవడంతో అధికారులు మూడుసార్లు వాయిదా వేశారు. ఈ మూడు సార్లు హెచ్చు పాటదారుడిగా భూక్యా వీరన్న నిలవడంతో సోమవారం సంత ఆవరణంలో ఎంపీడీఓ రవీందర్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సభకు మూడో వంతు జనాభా 1,551 మందికి గాను హాజరుకావాల్సిఉన్నా కోరం పూర్తి కాకపోవడంతో గంట పాటు వాయిదా వేశారు. ఆతర్వాత కూడా సరిపడా జనాభా రాకున్నా గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్చు పాటదారుడైన వీరన్నకు సంత నిర్వహణ బాధ్యతలు అప్పగించే విషయ మై 327 మంది ఆమోదం తెలిపారు. దీంతో 39 వారాలకు గాను రూ.1,46,10,000 చెల్లించేలా వీరన్నకు సంత కౌలు అప్పగిస్తున్నట్లు ప్రకటించారు. ఈమేరకు ఆయన మొదటి వాయిదా రూ.53.70లక్షలు చెల్లించాడు. దీంతో కొద్ది నెలలుగా ఎటూ తేలని సంత వేలం ప్రక్రియ పూర్తయినట్లయింది. సీఐ తిరుపతిరెడ్డి, ఎస్సై సాయికుమార్ ఆధ్వర్యాన బందోబస్తు ఏర్పాటు చేయగా ఎంపీఓలు రాజారావు, సత్యనారాయణ, కొండాయిగూడెం సొసైటీ చైర్మన్ హన్మంతరావు, డీసీసీబీ డైరెక్టర్ మల్లిబాబుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

ఆటోలో ఇరుక్కుపోయి డ్రైవర్ మృతి



శ్రీను (ఫైల్)

బూర్గంపాడు: మండల పరిధిలోని పాత గొమ్మూరుకు సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని కుక్కునూరు మండలం సీతారామనగరం గ్రామానికి చెందిన ఐతంరాజుల శ్రీను(36) ఆదివారం ఉదయం ఆటోలో చేపలను తీసుకుని భద్రాచలం మార్కెట్‌కు వెళ్లాడు. అవి విక్రయించుకుని రాత్రి వేళ తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో ఖమ్మం నుంచి భద్రాచలం వెళ్తున్న ఆర్టీసీ బస్సు పాత గొమ్మూరు సమీపంలో ఎదురుగా వచ్చి ఢీకొట్టగా, ఆటో నుజ్జునుజ్జయింది. డ్రైవర్ శ్రీను తీవ్రగాయాలతో ఆటోలో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్సై రాజేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. స్థానికులతో కలిసి ఆటోలో ఇరుక్కుపోయిన మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం బూర్గంపాడు సివిల్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి వద్ద మృతుడి కుటుంబసభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. మృతుడు శ్రీనివాస్‌కు భార్య రత్నకుమారి, ముగ్గురు పిల్ల లున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

జూలూరుపాడు: జూలూరుపాడుకు చెందిన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. జూలూరుపాడుకు చెందిన సురేష్(32) మద్యానికి బానిసయ్యాడు. దీంతో అతని భార్య ఐదు రోజుల క్రితం పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. అపస్మారకస్థితిలో పడి ఉండగా, గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం తరలించేందుకు 108 వాహనంలో ఎక్కిస్తుండగానే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

మూడు నెలల చిన్నారి మృతి



మృతిచెందిన చిన్నారి

మణుగూరు టౌన్: మూడు నెలల చిన్నారి నిద్రలోనే మృతి చెందిన సంఘటన మణుగూరులో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మణుగూరులోని రాజీవ్‌గాంధీ నగర్‌కు చెందిన ఇస్మాయిల్ – నసీమా దంపతులకు రెండో సంతానంగా మూడు నెలల క్రితం కూతురు జన్మించింది. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి తల్లిపక్కనే నిద్రపోయిన చిన్నారి సోమవారం ఉదయం కదలకపోవడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే పాప మృతి చెందిందని తెలిపారు. చిన్నారి మృతిని జీర్ణించుకోలేని కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు.

ఈకేవైసీ పేరుతో నగదు స్వాహా

అశ్వారావుపేటరూరల్: బ్యాంకు ఖాతాకు ఈకేవైసీ వివరాలు అప్‌డేట్ పేరుతో సైబర్ నేరగాళ్లు నగదు స్వాహా చేసిన ఘటన సోమవారం వెలుగు చూసింది. మండలంలోని తిరుమలకుంట గ్రామానికి చెందిన మామిడి వెంకట మహాలక్ష్మి వాట్సాప్ నంబరుకు ఓ లింకు రాగా, క్లిక్ చేసింది. కొద్ది సేపటి తర్వాత గుర్తు తెలియని వ్యక్తి ఆమెకు ఫోన్ చేసి యూనియన్ బ్యాంకు నుంచి మాట్లాడుతున్నానని, ఈకేవైసీ అప్‌డేట్ చేయకపోతే బ్యాంక్ అకౌంట్ లావాదేవీలు నిలిచిపోతాయని చెప్పాడు. బాధితురాలు ఫోన్ మాట్లాడుతున్న క్రమంలోనే తన రెండు బ్యాంకు ఖాతాల్లో నుంచి రూ.10,700 డ్రా చేసినట్లు మెసేజ్ వచ్చింది. అనంతరం వినాయకపురం యూనియన్ బ్యాంకు వద్దకు వెళ్లి ఆరా తీయగా, సైబర్ మోసగాళ్లు నగదు కాజేసినట్లు గుర్తించారు. దీనిపై బాధిత యువతి సైబర్ క్రైం హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేసింది.

చికిత్స పొందుతున్న మహిళ...



దాసరి పూర్ణ(ఫైల్)

కొత్తగూడెంటౌన్: అనుమానంతో భర్త రోకలిబండతో తలపై కొట్టగా తీవ్రగాయాలై చికిత్స పొందుతున్న మహిళ ఆదివారం రాత్రి మృతి చెందింది. వన్‌టౌన్ పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. కొత్తగూడెం సన్యాసి బస్తీకి చెందిన దాసరి శ్రీనివాసరావు కోర్టులో గుమస్తాగా విధులు నిర్వహిస్తున్నాడు. మూడు రోజుల క్రితం అర్ధరాత్రి సమయంలో శ్రీనివాసరావుకు, అతని భార్య పూర్ణ (50)కు మధ్య గొడవ జరిగింది. అనుమానంతో రోకలిబండతో తలపై బలంగా కొట్టడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. అరుపులకు పక్క గదిలో ఉన్న కుమారుడు కార్తీక్ మేల్కొని తల్లిని చికిత్స కోసం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించాడు. అక్కడ నుంచి ఖమ్మం, అనంతరం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. పూర్తి చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు శ్రీనివాసరావు పరారీలో ఉన్నాడని సీఐ ఎం.కరుణాకర్ తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

జూలూరుపాడు: మండంలోని భేతాళపాడుకు చెందిన గోపయ్య ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆదివారం రాత్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు గోపయ్య సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాణా ప్రతాప్ తెలిపారు.

ఆటో, బైక్ ఢీ : తండ్రీ కొడుకులకు గాయాలు

సుజాతనగర్: రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకులు గాయపడిన సంఘటన మండల కేంద్రంలోని హెచ్‌పీ బంక్ సమీపంలో సోమవారం జరిగింది. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం రాజారం గ్రామానికి చెందిన వీరన్న కుమారుడు వేణుకు రుద్రంపూర్‌లోని పాలిటెక్నిక్ కళాశాలలో సీటు వచ్చింది. దీంతో ధ్రువపత్రాలు ఇచ్చేందుకు వీరన్న కుమారుడిని తీసుకుని బైక్ కొత్తగూడెం వస్తున్నాడు. అదే సమయంలో హెచ్‌పీ బంక్‌లో నుంచి ఆటో బయటకు వస్తుండగా, రెండు వాహనాలు ఢీకొన్నాయి. దీంతో వీరన్నకు తీవ్ర, వేణుకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు.